
సాక్షి
ఒడిశా

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6.42.832లు, బంగారం 1గ్రాముల 490 మిల్లీగ్రాములు, వెండి 59 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

జయపురం భారతీ సాహితీ సంస్థ స్వర్ణోత్సవాలు ఘనంగా జరిగాయి. అతిథు లు నగరమంతా కలియతిరిగారు. - 8లో.



పేదలకు సేవ చేయడంలోనే..

సాయి గాయత్రి పరివార్ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. - 8లో.

న్యూస్‌రీల్

గుణుపూర్-తెరువలి రైలు మార్గంపై లోక్‌సభలో ప్రస్తావన



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ ఉలక

రాయగడ: కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక సామవారం లోక్‌సభ జీరో అవర్‌లో రాయగడ జిల్లాలో కొత్తగా నిర్మిస్తున్న గుణుపూర్-తెరువలి రైలు మార్గం గురించి ప్రస్తావించారు. ప్రతిపాదిత ఈ మార్గంలో రైల్వే విభాగం కొన్ని మార్పులు చేయగలిగితే మరి కొన్ని సమితుల ప్రజలు రైలు సౌకర్యాలను పొందగలరని వివరించారు. కొండలు, లోయలు తొలచి గుణుపూర్ -తెరువలి రైలు మార్గం పనులు చేపడుతున్న నేపథ్యంలో అదే గుణుపూర్ వయా బిసంకటక్, పద్మపూర్, రామనగుడ, గుడారి మీదుగా మార్గాన్ని నిర్మించగలిగితే లోయలు, కొండలు వంటి అవాంతరాలు ఎదురు కావాలని వివరించారు. ప్రతిపాదించిన గుణుపూర్ వయా బిసంకటక్, పద్మపూర్, రామనగుడ, గుడారి మీదుగా నిర్మాణం కొనసాగితే ఈ మార్గంలో ఉన్న పర్యాటక ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయని, అదేవిధంగా ప్రజల ఆర్థిక స్థితిగతులు కూడా మెరుగుపడతాయని వివరించారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ దృష్టి సారించాలని కోరారు.

అగ్ని సురక్షపై అవగాహన



అగ్ని ప్రమాద నివారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అటవీ శాఖ అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి అటవీ శాఖ అధికారి వాసుదేవ్ నాయిక్ ఆదేశాల మేరకు.. సోమవారం దళపతిగూడ పంచాయతీ డాయిగూడ గ్రామంలో రేంజర్ మురళీధర్ మహరణ నేతృత్వంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి సమీపిస్తున్నందున ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఇప్పె పూల కోసం పోడు వ్యవసాయం చేస్తారు. ఈ నేపథ్యంలో అడవులకు నిప్పు పెట్టడం వల్ల నష్టం జరుగుతుందని వివరించారు. గిరిజనుల్లో చైతన్యం కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఫ్లడ్ లైట్లు ఎందుకు వెలగలేదు..?

- వివరణ కోరుతూ ఓసీఏకి తాఖీదులు జారీ చేసిన సర్కారు

భువనేశ్వర్: కటక్ బారాబటి స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ మధ్య ఆదివారం జరిగిన వన్డే మ్యాచ్ సమయంలో ఫ్లడ్ లైట్ల వైఫల్యం కారణంగా 25 నిమిషాల పాటు ఆట నిలిపివేశారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ పరిస్థితుల పట్ల వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం మ్యాచ్ నిర్వాహక సంస్థ ఒడిశా క్రికెటు అసోసియేషన్ ఓసీఏకి సోమవారం తాఖీదులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర క్రీడలు, యువజన సేవల విభాగం నిర్వాహక సంస్థకు 10 రోజుల గడువు కేటాయించింది. ఉత్కంఠభరిత మ్యాచ్ సమయంలో ఫ్లడ్ లైట్ల అంతరాయానికి గల కారణాన్ని వివరించి, అలాంటి లోపాలకు కారణమైన వ్యక్తులు, ఏజెన్సీలను గుర్తించి, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించాలని తాఖీదుల్లో ఆదేశించింది.

ఆగని తాబేలు మాంసం విక్రయాలు



వారపు సంతలో తాబేళ్ల మాంసాన్ని అమ్ముతున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితిలో సోమవారం ఓ వ్యక్తి బహిరంగ మార్కెట్‌లో తాబేలు మాంసం విక్రయించారు. తాబేలు మాంసం విక్రయించడం నిషేధం. కానీ కోరుకొండ సమితి పిటాగేటా పంచాయతీలో వారపు సంతలో కిలో రూ.350కు అమ్ముతున్నాడు. దీనిపై అటవీ శాఖాధికారులను సంప్రదించగా ఆరా తీసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కొనుగోలుదారుని కోసం రైతు నిరీక్షణ

టమాటా @ రూ.2

భువనేశ్వర్:

ఢెంకనాల్ జిల్లాలో టమాటా ధర బాగా దిగజారింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ జిల్లా హతైబాడి గ్రామంలో టమాటా పంటకు కనీస గిట్టుబాటు ధర చిక్కడం లేదు. ఈ ప్రాంతంలో టమాటా కిలోకు రూ.2 కు పడిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. శీతల గిడ్డంగులు లేకపోవడంతో ఈ పరిస్థితి తాండవిస్తుందని రైతులు వాపోతుంది. ఈ విపత్కర పరిస్థితుల్ని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో పండిన పంటను సాగు చేసిన ప్రాంతంలో నిరుపయోగంగా వదిలేస్తున్నారు. ఢెంకనాల్ టమాటా రైతులు ధరల్లో అనూహ్యమైన తగ్గుదల వేధింపులు ఎదుర్కొంటున్నారు. విరివిగా పండిన పంటకు గిట్టుబాటు ధర లేక కిలో కేవలం రూ. 2కే అమ్ముతున్నారు. బ్రాహ్మణి నది వెంబడి ఉన్న గోండియా మండలం హతైబాడి గ్రామంలోని 100 మందికి పైగా రైతులు ఈ దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సంప్రదాయకంగా టమాటా సాగుపై ఆధారపడిన స్థానిక రైతులు తమ జీవనోపాధిని కోల్పోతున్నామని తల్లడిల్లుతున్నారు. దిగజారిపోతున్న ధరలతో కనీసం పెట్టుబడి కూడా చేతికి అందని విపత్కర పరిస్థితుల నుంచి తమకు ఆదుకునే నాథుడు కానరావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

ధరల పతనం వల్ల రైతులు తమ పంటలను కోయకుండా నిరుపయోగంగా పొలాల్లోనే విడిచి పెట్టేస్తున్నారు. తమ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నంలో అంచెలంచెలుగా ధర తగ్గించుకుంటు పూర్తిగా పతనమైన దశకు దిగజారిపోయారు. ఈ విపరీత పరిస్థితుల మధ్య దళారులు కోరిన ధరకే టమాటాలు విక్రయించడం అనివార్యం అవుతుంది. స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ యంత్రాంగాలు చోద్యం చూస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. టమాటా గిట్టుబాటు ధర పునరుద్ధరణకు సత్వర చర్యలు చేపట్టాల్సి ఉంది. అధిక దిగుబడి పరిస్థితుల్లో దీర్ఘ కాలం నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగులు అందుబాటులోకి తేవాలని బాధిత వర్గం అభ్యర్థిస్తుంది. ఢెంకనాల్ జిల్లా గోండియా మండలం హతైబాడి గ్రామంలో దాదాపు 100 ఎకరాల్లో టమోటాలు పండిస్తున్నారు. ఈ ఏడాది దిగుబడికి తగిన అమ్మకాలు లేకపోవడంతో ఇక్కడి రైతాంగం ఊహాతీతమైన పరిణామాల్ని చవి చూస్తుంది. ఇప్పుడు టమోటాల ధర బాగా పడిపోయింది. రాత్రింబవళ్లు శ్రమించిన రైతులు అపార నష్టాల మధ్య కొట్టుమిట్టాడుతుంది. కుటుంబ పోషణ ఆధారం అగమ్య గోచరమైంది. ఈ జిల్లాలో శీతల గిడ్డంగుల సౌకర్యం లేకపోవడంతో అధిక దిగుబడి పంటలకు గిట్టుబాటు ధర దక్కకుండా దళారులు రాజ్యం ఏలుతున్నారు. ఈ పరిస్థితుల నివారణకు ప్రభుత్వ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టాల్సి ఉంది.

గ్రీవెన్స్‌కు 86 వినతులు



పర్లాకిమిడి: గ్రీవెన్స్‌సెల్ వేదికపై కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి సమితి పురుణాపాణి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామముఖి అధికారులు గ్రీవెన్సుసెల్‌ను నిర్వహించారు. దీనికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గుణనిధి నాయక్ హాజరయ్యారు. గ్రీవెన్సుసెల్‌కు 86 వినతులు వచ్చాయి. వీటిలో గ్రామసమస్యలకు సంబంధించి 53, వ్యక్తిగతం 15 ఉన్నాయి. మూడు వినతులను అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు. సియాళిలిట్టి, పురణాపాణి, తబార్ సింగి, అనఘ గ్రామపంచాయితీల నుంచి ప్రజలు విచ్చేసి తమ అభియోగాలు అందజేశారు. భూపట్టాలు, రేషన్, వృద్ధాప్య పింఛనుపై ఎక్కువ వినతులు



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

న్నాయి. కార్యక్రమానికి ఆర్.ఉదయగిరి పంచాయతీ సమితి అధ్యక్షులు లక్ష్మీనారాయణ శోబోరో, ఐటీడీఏ పీవో అంశుమాన్ మహాపాత్రో, బీడీవో లారీమోహన్ ఖర్సల్, తహసీల్దార్ జ్యోతి మయిదాస్, డీఎస్‌ఎస్‌వో సంతోష్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతి



భువనేశ్వర్: ఖుర్దారోడ్ ప్రాంతంలో ఆంధ్రాలోని విశాఖకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. స్థానిక గొల్లై బజార్ వద్ద సోమవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో అపస్మారక స్థితిలో వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికుల దృష్టికి వచ్చింది. ఈ విషయం జట్నీ ఠాణా పోలీసులకు తెలియజేశారు. ఈ సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని తక్షణమే స్థానిక సౌండపూర్ సామూహిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా సదరు వ్యక్తి పేరు కర్రి సత్య నారాయణ, తండ్రి గంగరాజు, బీసీ కాలనీ, నర్సీపట్నం, విశాఖపట్నంగా గుర్తించారు. మృతదేహాన్ని భువనేశ్వర్ క్యాపిటల్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు చెప్పారు.

విద్యార్థులకు ఆల్బెండ్‌జోల్ మాత్రల పంపిణీ



నులిపురుగుల ఔషధాన్ని విద్యార్థితో మిగిస్తున్న కలెక్టర్ ఫరూల్ పట్వారి

రాయగడ: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని మునిగుడ సమితి హటోమునిగుడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండ్‌జోల్ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి పిల్లలకు మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్‌మెహన్ రౌత్రాయ్, డాక్టర్ మమత సాహు ఉన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- అత్తింటివారే హత్య చేశారని తండ్రి ఫిర్యాదు



రష్మీరంజని మృతదేహం



దేవాశీష్‌తో రష్మీ పెళ్లి

రాయగడ: వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. జిల్లాలోని గుణుపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి గణేష్ బిహార్ కాలనీలో సామవారం చోటుచేసుకోగా రష్మీరంజని బొడోకుమార్ (24) ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న గుణుపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృదేహాన్ని స్వాధీనం చేసుకుని గుణుపూర్ సబ్ డివిజనల్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే తన కుమార్తెను అత్తింటివారే గొంతునులిమి హత్య చేశారని ఆరోపిస్తూ మృతురాలి తండ్రి కుంజ బిహారి బొడోకుమార్ గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజపతి జిల్లా పర్లాకిమిడిలోని విద్యానగర్‌లో నివసిస్తున్న కుంజో బిహారి కూతురు రష్మీ రంజనికి రాయగడ జిల్లా పరిధిలోని చంద్రపూర్ గ్రామానికి చెందిన సతర చంద్ర మాఝి కొడుకు దేవాశీష్‌తో 2024 జూలై మూడో తేదీన అత్యంత వైభవంగా వివాహం జరిగింది. పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దేవాశీష్ తన భార్యను అన్యోన్యంగా చూసుకుంటుండేవాడు. అయితే కొద్ది నెలలుగా తనకు ఇచ్చిన కట్నం సరిపోదని.. ఇంకా తీసుకురావాలని భర్తతోపాటు అతని తల్లిదండ్రులు వేధిస్తున్నారని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే సోమవారం రష్మీరంజని మృతి చెందినట్లు సమాచారం రావడంతో కన్నవారు గుణుపూర్ చేరుకున్నారు. తన కూతురుని అదనపు కట్నం కోసం వేధించి గొంతునులిమి హత్య చేసినట్లు మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు మలుపు తిరిగింది. కాగా కేసు దర్యాప్తు కోసం జిల్లా అదనపు ఎస్‌పి విష్ణు ప్రసాద్‌పాత్రో సామవారంగుణుపూర్ చేరుకున్నారు. పోస్టు మార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

మంటల్లో విద్యార్థిని..



కృష్ణచంద్ర గజపతి కళాశాల వసతి గృహం



గాయపడిన నబీనో నాయక్

- ఉమెన్స్ హాస్టల్‌లో ఘటన
- దోమల కాయిల్‌తో చెలరేగిన మంటలు

పర్లాకిమిడి: మంటల్లో విద్యార్థిని చిక్కుకుంది. ఈ సంఘటన స్థానిక హనుమాన్ మందిర్ ఎదురుగా ఉన్న శ్రీక్రిష్ణ చంద్ర గజపతి కళాశాల ఉమెన్స్ హాస్టల్‌లో చోటుచేసుకుంది. దోమల కోసం పెట్టిన కాయిల్ కారణంగా చెలరేగిన మంటల్లో విద్యార్థిని నబీనో నాయక్ చిక్కుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. శ్రీక్రిష్ణచంద్ర గజపతి కళాశాలలో ప్లస్ త్రీ సైన్స్ చదువుతున్న నబీనో నాయక్ ఆదివారం రాత్రి దోమలు ఎక్కువగా ఉన్నాయని తన గదిలో దోమల కాయిల్ వెలిగించి నిద్రపోయింది. కాయిల్ దుప్పటికి తగలడంతో మంటలు వ్యాపించగా.. అందులో విద్యార్థిని చిక్కుకుని కాలిపోయింది. దీంతో వార్డెన్‌కు విద్యార్థులు ఫిర్యాదు చేయగా వెంటనే ప్రభుత్వ కేంద్ర మెడికల్‌కు నబీనో నాయక్ తరలించారు. కాలిపోయిన నబీనో నాయక్‌కు ప్రత్యేక వార్డులో ఉంచి డాక్టర్లు చికిత్స చేస్తున్నారు. ప్రస్తుతానికి ప్రాణాపాయం ఏమీ లేదని డాక్టర్లు తెలియజేశారు.

యంత్రాలతో మనరేగా పనులు



ఎం.పి.వి 82 గ్రామం రహదారి

మల్కన్‌గిరి: జిల్లా కలిమెల సమితి ఎం.పి.వి 82 గ్రామం వద్ద రహదారి నిర్మాణ పనులు మనరేగా పథకంలో నిర్వహిస్తున్నారు. ఈ పనుల్లో రోజు కూలీలుగా గ్రామస్తులను వాడకూండా అధికారులతో చేతులు కలిపి కాంట్రాక్టర్లు యంత్రాల ద్వారా పనులు చేస్తున్నారు. పేదలు వలస వెళ్ల కూడనే ఉద్దేశంతో ప్రభుత్వం మనరేగా పథకంలో ఏడాదికి 100 రోజులు ఉపాధి కాల్పిస్తుంది. ఈ రహదారి నిర్మాణ పనులు కోసం రూ.7.71 లక్షల వ్యయంతో పూర్తి చేయాలి. ఈ పనుల్లో కూలీలను వాడాలి. అలా చేయడం లేదు. ఈ విషయంపై జిల్లా అధికారులు దృష్టిపెట్టి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జూనియార్ ఇంజినీర్‌ను సంప్రదించేదుకు ప్రయత్నించినప్పటికీ ఆయన నుంచి ఏలాంటి స్పందన రాలేదు.

శ్రీనివాస్ మోటార్ గ్యారేజీలో అగ్ని ప్రమాదం



గ్యారేజీలో మంటలు



మంటలకు కాలిపోయిన కారులు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: స్థానిక తుంబిగుడ కూడలి వద్ద గల శ్రీనివాస్ మోటార్ గ్యారేజీలో సామవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.13 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. మంటల తీవ్రతకు గ్యారేజీలో గల మూడు కార్లు దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికీ గ్యారేజీలో గల స్పేర్ పార్టులు, కార్లు తదితరమైన వస్తువులు కాలిపోయాయి. ఎప్పటిలాగే గ్యారేజీ యజమాని శ్రీనివాస్ ఉదయం 8 గంటలకు గ్యారేజీకి వెళ్లి పనులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గ్యారేజీ ఒక వైపు నుంచి మంటలు చెలరేగడంతో కేకలు పెట్టాడు. అక్కడి వారు వెంటనే వెళ్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే ఎవరో గుర్తు తెలియని దుండగులు ఉద్దేశపూర్వకంగానే గ్యారేజీకి నిప్పు పెట్టినట్లు యజమాని శ్రీనివాస్ అనుమానిస్తున్నాడు. దీంతో ఆ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తారని ఐఐసీ కెకె బికె కుహరా తెలియజేశారు.

పిల్లల చదువుపై దృష్టిపెట్టాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు

జయపురం: పిల్లల చదువుపై పెద్దలు దృష్టిసారించాలని సునైన కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్స్ డైరెక్టర్ ఎస్.దాశరథి అన్నారు. చిన్నారులకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల ద్వారా అభినవ విద్యావిధానం ప్రశంసనీయమని.. ఈ నూతన పద్ధతి సత్ఫలితాలు ఇస్తోందని చెప్పారు.ఆ దివారం సాయంత్రం స్థానిక ఫవర్ హౌస్ గీతాంజలి మండప ప్రాంగణంలో బణీత ప్లే స్కూల్ నాలుగో వార్షికోత్సవంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను మంచి వ్యక్తులుగా తీర్చి దిద్దాలన్నారు. అభినవ విద్యాశైలిపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. బణీతా స్కూల్ డైరెక్టర్ శిభాశిష్ పాణిగ్రహి అత్యక్షతన జరిగిన వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, గౌరవ అతిథిగా విశ్రాంత ఉపాధ్యాయులు, జూనియర్ రెడ్‌క్రాస్ జిల్లా అధికారి యజ్ఞేశ్వర పండ, ప్రత్యేక అతిథులుగా కొరాపుట్ జిల్లా డైట్, జయపురం అధికారి రూపచంద్ర సొరెన్, జయపురం బ్లాక్ విద్యాధికారి కైళాశ చంద్రశతపతి, జయపురం రెడ్‌ఉడ్ ఇంగ్లిష్ పాఠశాల ప్రిన్సిపాల్ అనిత దాస్, జయపురం మీరా డాన్స్ గ్రూపు డైరెక్టర్ పంచానన మిశ్ర ప్రసంగించారు. సభానంతరం పిల్లలు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో సభికులను అలరించారు. కొంతమంది చిన్నారులు శ్లోకాలను పఠించి శ్రోతలను అబ్బుర పరచారు. మరి కొందరు నృత్య నాట్యాలతో ఆకట్టుకున్నారు.

క్లుప్తంగా

'స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'


మాట్లాడుతున్న సవర రాంబాబు

కాశీబుగ్గ: అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు గిరిజనులపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు వజ్రాయుధమైన 1-70 యాక్ట్ నిర్వీర్యం చేసేందుకు చూస్తున్నారని, అవసరమైతే గిరిజన యాక్ట్‌లను పటిష్టం చేయాలి గానీ కించపరిచేలా మాట్లాడం దారుణమన్నారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం వారితో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందించాలన్నారు. టూరిజం ప్రాంతాల్లో గిరిజనులతో స్టాల్స్, హోటల్స్ పెట్టించే ఏర్పాటు చేయాలన్నారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మన్యం జిల్లాలో మంగళవారం, బుధవారం చేపట్టే బంద్ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్ర రాజు, ఎం.జగ్గారావు, భాగ్యరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు


చిగురు మేఘం నాటిక దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళా మందిర్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా సోమవారం రెండు నాటిక ప్రదర్శనలు జరిగాయి. ముందుగా కేశిరెడ్డి రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. కళ సేవ ఎంతో గొప్పదన్నారు. గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ వారి ఏవూరి హరిబాబు దర్శకత్వంలో 'చిగురు మేఘం' నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. అనంతరం విజయవాడ మైత్రీ కళా నిలయం ఆధ్వర్యంలో టి.వి.పురుషోత్తం దర్శకత్వంలో 'బ్రహ్మస్వరూపం' నాటిక ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ఎల్.రామలింగస్వామి, బీఏ మోహనరావు, నిక్కు అప్పన్న, జ్యోతి, రామచంద్రదేవ్, సత్యవతి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ఫేక్' ఉద్యోగాల ఫిర్యాదులపై విచారణ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖలో సంచలనమైన ఫేక్ ఉద్యోగాల నియామకపత్రాలతో పాటు ఉద్యోగమిప్పిస్తామంటూ తనను మోసం చేశారని బాధితురాలు ఎస్.ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై ఈనెల 12న డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ జరగనుంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖాధికారుల ఆదేశాల ప్రకారం విశాఖపట్నం డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావును విచారణాధికారిగా నియమించిన సంగతి తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో బాధితురాలి వాంగ్మూలాన్ని అలాగే ఫిర్యాదులో పేర్కొన్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ జీవీ నరసింహం, కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌తో పాటు అప్పట్లో డీఎంహెచ్‌వోగా పనిచేసిన బొడ్డేపల్లి మీనాక్షిల వాంగ్మూలాన్ని కూడా స్వీకరించాల్సి ఉంటుంది. అయితే విచారణ నోటీసులు మాత్రం ఈ వ్యవహారంతో సంబంధం లేనివారికి కూడా జారీ చేయడం గమనార్హం. దీంతో విచారణను నీరుగార్చేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

నిందితుడు అరెస్టు

కాశీబుగ్గ/పలాస: పలాస మండలం పెదంచల గ్రామానికి చెందిన రౌడీ షీటర్ ఒడిశి భాస్కరరావును కాశీబుగ్గ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 27 ఏళ్ల దివ్యాంగురాలిపై అఘాయిత్యానికి ఒడిగట్టిన కేసులో అతడిని అరెస్టు చేశారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం .. పెదంచల గ్రామానికి చెందిన దివ్యాంగులు గర్భం దాల్చింది. ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉండటంతో నాన్నమ్మ వద్దనే ఆమె ఉండేవారు. ఈ నేపథ్యంలో ఒడిశి భాస్కరరావు బాధితురాలిని లోబర్చుకుని గర్భవతిని చేశాడు. సుస్తీగా ఉందని ఆస్పత్రికి తీసుకెళ్తే విషయం బయటపడింది. కాశీబుగ్గలో నివాసం ఉంటున్న భాస్కరరావు తరచూ తన స్వగ్రామం పెదంచల వచ్చిపోతుండేవాడు. తన ఇంటిని తుడవాలని పదే పదే పిలిచేవాడని, తాను గర్భవతిని కావడానికి ఆయనే కారణమని దివ్యాంగురాలు ఆరోపించింది. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదరించాడని ఫిర్యాదులో పేర్కొంది. భాస్కరరావుపై కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో మర్డర్ కేసు ఉండటంతో ఆయనపై రౌడీషీటర్ తెరిచి ఉంది. చీటింగ్‌కేసు సైతం నమోదై ఉంది. ప్రస్తుతం భాస్కరరావుపై కేసు నమోదు చేశామని సీఐ సూర్యనారాయణ తెలిపారు.

బిల్డింగ్ కమిటీ సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బిల్డింగ్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. భవనాల నిర్వహణ, మౌలిక సౌకర్యాల కల్పన, ఫర్నీచర్ ఏర్పాట్లు వంటి అంశాలు చర్చించారు. ప్రధానంగా తరగతి గదులు, వసతి గృహాల నిర్వహణపై మాట్లాడారు. సమావేశంలో వీసీ రజనీ, రిజిస్ట్రార్ సుజాత, బిల్డింగ్ కమిటీ సభ్యుడు పొగిరి సుగుణాకరరావు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి
- ఘనంగా సాయి గాయిత్రి పరివార్ ప్రథమ వార్షికోత్సవం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి, పక్కన కొట్‌పాడ్ ఎమ్మెల్యే భొత్ర

జయపురం:

పేదలకు సేవ చేయటంలోనే సంతృప్తి ఉంటుందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సాయి గాయిత్రి పరివార్ ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాయి గాయిత్రీ పరివార్ నిర్వాహకులు బిజయ నారాయణ సాహు, కో ఆర్డినేటర్ లాలూ షొడంగి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బొరిగుమ్మ భైరవ మందిర ప్రాంతంలో సాయి గాయిత్రి శిలాలిపి జీర్ణధారను ఎమ్మెల్యే ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సేవలు అందించేటప్పుడు జాతి, కుల, మత బేధాలు, తారతమ్యాలు విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయి గాయిత్రి వార్షిక నిర్వాహకులు పలు దాన, ధర్మాలు, సన్మానాలు చేపట్టారు. నిరుపేదలకు కంబళ్లు, దుస్తులు పంపిణీ చేశారు. కొట్‌పాడ్ బీజేపీ ఎమ్మెల్యే రూప భొత్ర, బీజేడీ నేత మాజీమంత్రి రబి నారాయణ నందో, దక్షిణ ఒడిశా అభివృద్ధి పరిషత్ అధ్యక్షుడు బృగు బక్షీపాత్రో తదితరులు పాల్గొన్నారు.


సాయిదేవి శిలాలిపి జీర్ణధారను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి


సాయి గాయిత్రి పరివార్‌తో జయపురం, కొట్‌పాడ్ ఎమ్మెల్యేలు


రిటైర్డ్ టీచర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బిహిణీపతి

బలిమెల ఎన్ఏసీలో గ్రీవెన్స్


దివ్యాంగుడి ఫిర్యాదు అందుకుంటున్న కలెక్టర్ ఆశీష్ పటేల్


గ్రామస్తుల సమస్యలపై ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్ఏసీ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ గ్రీవెన్స్ నిర్వహించారు. దివ్యాంగులు తమ సమస్యలను చెప్పుకున్నారు. మొత్తం 82 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ తాపస్ నారాయణ్ రోతో, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, బలిమెల ఎన్ఏసీ చైర్మన్ ప్రదీప్ నాయిక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


కొత్త వీల్ చైర్లు అందుకున్న దివ్యాంగులతో కలెక్టర్ ఆశీష్ పటేల్ ఇతర అధికారులు

అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం


సురేష్‌బాబు సింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నామని మహారాణా ప్రతాప్‌సింగ్ హైందవ సేవా సంఘ్ అధ్యక్షుడు పి.సురేష్‌బాబు సింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందూ ఆలయంలో పనిచేస్తున్న ప్రధాన అర్చకుడిపై జరిగిన దాడిని హిందూ ధర్మ పరిరక్షకులపై జరిగిన దాడిగా అభివర్ణించారు. హిందూ ఆలయాల పరిరక్షణ కోసం, సాంప్రదాయాలు, వారసత్వ హక్కుల కోసం అర్చకులు రంగరాజన్ విశేషమైన కృషి చేశారన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ఎంతో నిబద్ధతతో తనవంతుగా నిర్విరామంగా ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రంగరాజన్‌పై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

రేషన్ పంపిణీలో అక్రమాలు..?

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీ పరిధిలో కూటమి ప్రభుత్వం వచ్చాక కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా స్థానిక డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి తొలగించారు. అతని స్థానంలో టీడీపీ కార్యకర్త ఎలాంటి నియామకం లేకుండానే రేషన్ కోసం డీడీలు కట్టి అనధికారికంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే బియ్యం పంపిణీలో కేజీ నుంచి రెండు కేజీల వరకు కోత విధిస్తూ లబ్ధిదారులకు అందజేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రేషన్‌ను ఎండీయూ ఆపరేటర్ పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ, స్థానిక టీడీపీ కార్యకర్తే దగ్గరుండి అక్రమాలకు పాల్పడుతూ పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై డిప్యూటీ తహసీల్దార్‌కు వివరణ కోరగా మంగళవారం విచారణ జరుపుతామని తెలియజేశారు.

చంద్రపూర్‌లో వినతుల స్వీకరణ


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఫరూల్ పట్వారి

రాయగడ: జిల్లాలోని మారుమూల ప్రాంతమైన చంద్రపూర్‌లో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమితి పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది వినతులు అందజేశారు. ఇందులో 14 వ్యక్తిగత సమస్యలు కాగా మిగతా 15 గ్రామ సమస్యలుగా గుర్తించారు. మరో నలుగురుకి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 25 వేల రుపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మౌలిక సమస్యలను కల్పించాలని వినతుల్లో విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెమండో, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మెహన్ రౌత్రాయ్, తహసీల్దార్ ఆశీష్ కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఇచ్ఛాపురం టౌన్: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలకు వ్యతిరేకంగా ఇచ్ఛాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు సోమవారం ఆందోళన చేపట్టారు. నూతన నిబంధనల ప్రకారం ఆటోల రికార్డులు, లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు చేయించుకోవాలంటే ఎచ్చెర్ల వాహన తనిఖీ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. దీనివలన ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. గత 25 ఏళ్లుగా కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాలకు చెందిన వాహనాలకు ఇచ్ఛాపురం కార్యాలయంలోనే తనిఖీలు జరిపి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించేవారిని తెలియజేశారు. ప్రస్తుతం ఇచ్ఛాపురం నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎచ్చెర్లకు వెళ్లడం వ్యయ, ప్రయాసలతో కూడుకున్నదని పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానిక ఎంవీఐ ఆర్.గోవిందరాజుకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వి.దుర్యోధన, సెక్రటరీ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

- ఐదుగురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నూకమ్మ

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం రాజపురం గ్రామ సమీపంలో సోమవారం వేకువజామున ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మూలపేట గ్రామం నుంచి ఐదుగురు ప్రయాణికులతో నౌపడ వైపు వెళ్తున్న ఆటో, పొగమంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించకపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడినవారిని తక్షణమే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికుల్లో కప్పాలు నూకమ్మకు కాలు విరిగిపోగా, మిగతావారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నౌపడ ఎస్ఐ నారాయణ స్వామి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


జాతీయ రహదారిపై ఢీకొన్న లారీలు

రణస్థలం: మండలంలోని జేఆర్‌పురం జాతీయ రహదారిపై సోమవారం ఉదయం రెండు లారీలు బలంగా ఢీకొన్నాయి. జేఆర్‌పురం జాతీయ రహదారి పక్కన కూరగాయల మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు నిత్యం పదుల సంఖ్యలో లారీలు ఆగుతుంటాయి. ఈ క్రమంలోనే ఒక లారీ డ్రైవర్ కూరగాయలు కొనుగోలు చేసిన తర్వాత ముందుకు కదిలేందుకు కుడివైపు తిప్పుతుండగా, విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీ ఢీకొంది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో వాహనాలు బారులుతీరాయి.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


ఇతర రాష్ట్రాల అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న భారతీ సభ్యులు


కొలాబ్ నగర్‌లో కాళిక మందిరం సందర్శించిన రచయితలు


హనుమాన్ విగ్రహం వద్ద భారతీ సభ్య రచయితలు

జయపురం: జయపురం భారతి సాహితీ సంస్కృతి సమాజం స్వర్ణోత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్థానిక భారతి సభ్యులు,హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వచ్చి స్వర్ణోత్సవాల్లో పాలు పంచుకున్నారు. అలాగే భారతీ ఉత్సవాల నిర్వాహకులతో జయపురం సమీప ఎల్లో డేమ్, కొలాబ్ నగర్ ప్రాంతంలో గల కాళికా మందిర్, వీర హనుమాన్ మందిరాలను సందర్శించారు. అందమైన ఆలయాలను, అటవీ ప్రాంతాలను సందర్శించిన అతిథులు మైమరచిపోయారు. రచయిత విశాఖపట్నం వాసి వడుగూరి సూర్యనారాయణ మూర్తి సారథ్యంలో నిర్వహించిన అంత్యాక్షరి ఉత్సాహంగా సాగింది. అనంతరం కేవీ రమణ, బల్లా విజయకుమార్ నిర్వహించిన క్విజ్ కార్యక్రమంలో గరికపాటి సూర్య ప్రభ, ఆరిక రాధాకృష్ణ, ధరణి, వి.నాగజ్యోతి, మళ్ల జ్యోతిర్మయి, ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు. సాహిత్యకారులకు కేవీ రమణ, విజయకుమార్ జ్ఞాపికలు అందజేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

పర్లాకిమిడి: స్థానిక కోమటివీధిలోని వేంకటేశ్వర మందిర బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చక్రస్నానాలు, పుష్పయోగం భద్రం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపించారు. సాయంత్రం కళ్యాణ మండపంలో సులలితా సంగీత భారతి ఆధ్వర్యంలో ఆకాశవాణి ఫ్లూట్ కళాకారులు వెల్లంకి కూర్మనాథం ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనల రాగరత్నమాలిక కార్యక్రమం వైభవంగా జరిగింది. అన్నమయ్య సంగీత విభావరిలో కీబోర్డుపై ఇనపకుర్తి వేంకటరమణ, తబలాపై నృసింహప్రసాద్ చరతి, ప్యాడ్స్‌పై రాజేష్, గాయనీ గాయకులు మోహిత్, డి.అఖిల్, అర్చనా రథ్‌లు అన్నమయ్య కీర్తనలు పాడి ప్రేక్షకులను అలరించారు.


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామివారు

ముగిసిన మిస్టర్ ఆంధ్రా పోటీలు

- చాంపియన్‌గా నిలిచిన శివాజీ
- రాష్ట్ర నలుమూలల నుంచి పాల్గొన్న బాడీ బిల్డర్లు
- కండల ప్రదర్శనతో ఆకట్టుకున్న క్రీడాకారులు


మిస్టర్ ఆంధ్రా టైటిల్ అందుకుంటున్న శివాజీ


60 కేజీల విభాగం విజేతలతో డాక్టర్ గొండు గంగాధర్, తిరుమలరావు, విజయ్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పీఎస్‌ఎన్‌ఎం హెచ్ స్కూల్ ప్రాంగణం వేదికగా శ్రీకాకుళం జిల్లా స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి వరకు జరిగిన 30వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీల్లో 55 కేజీలు, 60, 65, 70, 75, 80, 85, 85+ బరువు కేటగిరీల్లో క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 210 మంది క్రీడాకారులు హాజరవ్వగా, వీరిలో 150 మంది పోటీలకు అర్హత సాధించారు. వీరంతా తమ కండలను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన వి.శివాజీ చాంపియన్‌గా నిలిచాడు. 8 వయో విభాగాల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచినవారికి రూ.1.25 లక్షల బహుమతులు అందజేశారు. ముఖ్య ప్రతినిధులు వి.విజయ్‌కుమార్, బలగ ప్రసాద్‌లు ట్రోఫీలు బహుకరించారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున యువత హాజరయ్యారు. సినీ నటుడు షేక్ శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.


85 కేజీల విభాగంలో కండలు ప్రదర్శిస్తున్న బాడీ బిల్డర్లు


తన శరీర సౌష్టవాన్ని చూపిస్తున్న శివాజీ

సిక్కోలు వేదికగా 11వ సారి...

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ గొండు గంగాధర్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. బాడీ బిల్డింగ్ చేయడం వలన అనారోగ్యాలు దరిచేరవని పేర్కొన్నారు. ఇప్పిలి తిరుమలరావు, బి.సూరిబాబు, సినీ నటుడు షేక్ శ్రీనివాస్(విశాఖ) తదితరులు మాట్లాడుతూ.. బాడీ బిల్డింగ్ క్రీడ ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, శ్రీకాకుళంలో వరుసగా 10 సార్లు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి, 11వ సారి కూడా విజయవంతంగా నిర్వహించేలా అత్యద్భుతంగా ఏర్పాట్లు చేసిన విజయ్‌కుమార్, ప్రసాద్ బృందాన్ని అభినందించారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా, వారిని వ్యాయామం వైపు మళ్లించేలా విజయ్, అతని మిత్రబృందం చేస్తున్న కృషిని కొనియాడారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: విజయ్

ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోటీలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బాడీ బిల్డర్స్ ఎక్కువ మంది పేద, మధ్య తరగతికి చెందిన వారేనని, ప్రభుత్వం చొరవతీసుకుని ప్రభుత్వ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం సీనియర్ బాక్సింగ్ కోచ్ మాణిక్యం ఉమామహేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ వి.విజయ్, అధ్యక్షుడు బలగ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ కె.గౌరీశంకర్(ఆముదాలవలస), ఎస్.శివకుమార్, పి.గోపాల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. చీఫ్ రిఫరీగా కె.గురునాథరావు, రిఫరీలుగా టి.రాము, ఆర్‌వీఎల్ రత్నాకరరావు, ఎన్వీ నాగేశ్వరరావు, జి.విష్ణుమూర్తి, డి.కనకరాజు, బీవీఆర్ రెడ్డి, బి.మర్రిరెడ్డి, గుండేష్ రాము, అమ్ములు, జి.శ్రీను, కె.కిరణ్, కె.సోమినాయుడు వ్యవహరించి మెప్పించారు.

క్లుప్తంగా

ఈఈఏటీలో మక్కువ విద్యార్థినికి 2వర్యాంక్



విద్యార్థిని జ్యోత్స్నకు అవార్డును అందిస్తున్న సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య

మక్కువ: ఎడ్యుకేషనల్ ఎంఫసీ ఎన్‌జీవో సంస్థ నిర్వహించిన ఈఈఏటీ ప్రతిభా పరీక్షలో మక్కువ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదవతరగతి చదువుతున్న ఆర్.జ్యోత్స్న రాష్ట్రస్థాయిలో రెండవర్యాంక్‌ను సాధించింది. ఈ మేరకు సోమవారం విజయవాడలో జరిగిన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య చేతుల మీదుగా విద్యార్థిని జ్యోత్స్నకు ధ్రువీకరణ పత్రంతో పాటు, మెమెంటో, రూ.25వేల నగదును అందించారు. జ్యోత్స్న గతంలో జరిగిన ఎన్ఎంఎస్ఎస్ ప్రతిభా పరీక్షలో కూడా జిల్లాస్థాయిలో మొదటిస్థానం సాధించింది. విద్యార్థిని జ్యోత్స్న ఈఈఏటీ ప్రతిభా పరిక్షలో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించడంతో, హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

భుజంగరావుకు సత్కారం



భుజంగరావును సత్కరిస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన బంగారు భుజంగరావును తెలంగాణ విద్యాఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. వరంగల్ జిల్లా హన్మకొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఈనెల 9న జరిగిన ఉభయ రాష్ట్రాల దివ్యాంగ కళాకారుల సాంస్కృతిక ఉత్సవంలో భుజంగరావు పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో భుజంగరావు పుష్ప-2 సినిమాలోని గంగో రేణుక తల్లీ పాటకు డ్యాన్స్ చేసి అక్కడ ఉన్నవారిని అలరించారు. ఈ క్రమంలో భుజంగరావు టాలెంట్‌ను గుర్తించిన సంస్థ అధినేత బిల్లా మహేంద్రతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు భుజంగరావుకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో పలువురి టీవీ ఆర్టిస్టులు పాల్గొన్నారు.

వంశధార నదిలో మునిగి వ్యక్తి మృతి



వంశధార నదీతీరంలో చక్రపాణి మృతదేహం వద్ద రోదిస్తున్న కొడుకు నిరంజన్

భామిని: మండలంలోని బిల్లుమడకు చెందిన కోటిలింగాల చక్రపాణి(70) వంశధార నదిలో మునిగిపోయి సోమవారం మృతి చెందాడు. ఇటీవల భామిని మండలం బిల్లుమడ రేవులో అక్రమంగా నడిపిన ఇసుక ర్యాంప్‌లతో ఇసుక దిబ్బలు గోతులుగా మారి నదినీరు ప్రవేశించింది. ఇదే గోతిలో స్నానానికి దిగిన కోటిలింగాల చక్రపాణి(70) మునిగిపోయి మరణించినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి వివాహితుడైన కుమారుడు నిరంజన్, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఈ మరణవార్త తెలుసుకున్న పాలకొండ సీఐ చంద్రమౌళి, బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్‌లు బిల్లుమడను సందర్శించి కేసు నమోదు చేసి శవపంచనామా చేశారు.

విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న పువ్వల వాసవి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం జి.శివడ గ్రామానికి చెందిన పువ్వల వాసవి(15) సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే ఒడిశాలోని తులసివలస గ్రామానికి చెందిన వాసవి తల్లి మంగ చిన్నప్పుడే చనిపోగా తండ్రి శ్రీనివాసరావు సమ్మతితో సొంత పిన్ని శకుంతుల, చిన్నాన్న కూర్మారావు పెంచుకుంటూ చదివిస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న ఓ శుభకార్యం పనుల్లో అంతా నిమగ్నమై ఉండగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగేసిన వాసవి తీవ్ర అస్వస్థతకు గురై నోట్లోంచి సొంగ రావడం గమనించిన కుటుంబసభ్యులు హుటా హుటీన మొండెంఖల్లు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం భద్రగిరి సీహెచ్‌సీకి తీసుకురాగా అప్పటికే వాసవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వాసవి లంకాజోడులోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శని, ఆదివారాల్లో గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన హిందీ ప్రచార సభ పరీక్షలు రాసేందుకు జి.శివడలోని ఇంటికి వెళ్లి ఇంట్లో నుంచే రెండు రోజుల పాటు పరీక్షా కేంద్రానికి వెళ్లి హిందీ ప్రచార సభ పరీక్షలను రాసింది. తిరిగి పాఠశాలకు సోమవారం దిగబెట్టాల్సి ఉండగా.. ఈ సంఘటన జరిగింది. అయితే వాసవి ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మరుగుదొడ్ల నిధులు మాయం

- డోలపేట హైస్కూల్‌లో నాడు-నేడు పనుల్లో అధికారుల చేతివాటం
- డిపార్ట్‌మెంట్ అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



డోలపేట హైస్కూల్

రాజాం: పట్టణపరిధిలో డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆధునికీకరణ నిమిత్తం మంజూరైన నాడు-నేడు నిధుల్లో గోల్‌మాల్ వ్యవహారం కనిపిస్తోంది. రూ.3 లక్షలు నిధులు కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో ఈ ఘటన బయటకు తెలిసింది. మాయమైన నిధుల వ్యవహారంలో సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. మాయమైన నిధులు తిరిగి కాంట్రాక్టర్‌కు చెల్లించేందుకు సంబంధిత అధికారులు గడువు కోరినట్లు తెలిసింది. ఆ వివరాలిలా ఉన్నాయి.

డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో నూతనంగా ఐదు మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం 2020 ఏడాదిలో రూ. 5.20 లక్షలు నిధులు మంజూరుచేశారు. నాడు-నేడు ద్వారా పనులు ప్రారంభించారు. అనుకున్న ప్రకారం పనులు పూర్తిచేసినప్పటికీ కాంట్రాక్టర్‌కు రూ. 5 లక్షలు చెల్లించాల్సి ఉండగా, రూ. 2 లక్షలు చెల్లించి, మిగిలిన రూ. 3 లక్షలు చెల్లించేందుకు నిధులు రాలేదంటూ అధికారులు సమయాన్ని కాలయాపన చేశారు. దీంతో చివరిదశలో ఉన్న మరుగుదొడ్ల పనులను కాంట్రాక్టర్ నిలిపివేశాడు. ప్రభుత్వం మారిన తరువాత పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు నిధుల విడుదలకు కొంతమంది కాంట్రాక్టర్‌లు కలెక్టర్‌తో పాటు సర్వశిక్షాఅభియాన్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న డోలపేట స్కూల్ నిధులపై ఆరాతీయగా, ఇప్పటికే రూ.5 లక్షలు నిధులు విడుదలైనట్లు రికార్డుల్లో చూపించడంతో సంబంధిత కాంట్రాక్టర్ అవాక్కయ్యాడు. తనకు పూర్తిస్థాయిలో డబ్బులు రాలేదని అధికారుల ఎదుట మొరపెట్టుకోవడంతో పాటు ఈ వ్యవహారంపై నిధులు తినేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్ఏ జిల్లా అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

త్వరలో ఇచ్చేసేందుకు ఒప్పందం

ఈ నిధుల వ్యవహారం బయటకు రావడంతో మిగిలిన ప్రాంతాల్లోని కాంట్రాక్టర్‌లు కూడా తమకు రావాల్సిన నిధులపై ఆయా పాఠశాలల్లో ఆరాతీయడం ప్రారంభించారు. మరో వైపు డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో రూ. 3 లక్షలు నిధులు గోల్‌మాల్ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో ఏఈ జగదీష్ కలగచేసుకుని అప్పట్లో నిధులు వచ్చాయని, సకాలంలో విత్‌డ్రా చేయకపోవడంతో వెనక్కు వెళ్లిపోయాయని కాంట్రాక్టర్‌కు నచ్చజెప్పడం ప్రారంభించారు. ఈ నిధులు వారం పదిరోజుల్లో కాంట్రాక్టర్‌కు అందజేస్తామని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై కాంట్రాక్టర్‌గా వ్యవహరించిన పాలవలస బాబూరావు వద్ద సాక్షి ప్రస్తావించగా, అప్పట్లో నిధులు వచ్చాయని కనీసం తనకు చెప్పలేదని, నిధులు డ్రా చేసినట్లు ఇటీవల తెలిసిందని ఆరోపించారు. నాడు-నేడు పనులు పర్యవేక్షించిన జేఈతో పాటు అప్పట్లో పాఠశాల హెచ్ఎంగా ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడిపై అనుమానాలు ఉన్నాయని, పదిరోజుల గడువును ఏఈ కోరారన్నారు. ఈ గడువులోగా తన డబ్బులు రాకుంటే కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై నాడు-నేడు పనుల జేఈగా వ్యవహరించిన జగదీష్ వద్ద సాక్షి ప్రస్తావించగా, రూ.3 లక్షల నగదు విడుదలలో తేడాలు జరిగినట్లు ఒప్పుకున్నారు. ఈ విషయాన్ని పెద్దది చేయవద్దని కాంట్రాక్టర్‌కు చెప్పామని, వారం పదిరోజుల్లో డబ్బులు చెల్లించే ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. ఇన్నాళ్ల కాలయాపనకు కారణాలు చెప్పేందుకు ఏఈ నిరాకరించారు.

నేడు శంబర పోలమాంబ అమ్మవారి మూడోజాతర



శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, సీఐ రామకృష్ణలు ఏర్పాట్లు చేపట్టారు. మారుజాతర నాడు, రథసప్తమి పండగ కావడంతో భక్తుల రద్దీ తక్కువగా ఉన్నందున, మూడో జాతరకు భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అందుకు తగినట్లు ఏర్పాట్లు సోమవారం దేవాదాయశాఖాధికారులు నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వనంగుడి, చదురుగుడిల వద్ద క్యూలు ఏర్పాటు చేశారు. క్యూల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. భక్తులకు 15వేల లడ్డూ, పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేశారు. జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో 100మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు.



జాతర ఆదాయం లెక్కిస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

పోలమాంబ హుండీల ఆదాయం రూ.19,16,183

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడిలలో ఏర్పాటు చేసిన శాశ్వత హుండీలను సోమవారం ఈవో వి.వి. సూర్యనారాయణ, ఉత్సవకమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించారు. చదురుగుడి, వనంగుడిలలో 12శాశ్వత హుండీలను లెక్కించగా, చదురుగుడి హుండీల ద్వారా రూ.14,62,984, వనంగుడి హుండీల ద్వారా రూ.4,53,199 మొత్తంగా రూ.19,16,183 ఆదాయం వచ్చినట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. గతేడాది నవంబర్ 3వతేదీనుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 10వతేదీ వరకు హుండీలలో భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించినట్లు ఈవో తెలిపారు.

నటుడు తిరుపతిరావుకు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ టాలెంట్ అవార్డ్

విజయనగరం టౌన్: విజయనగరం జిల్లా బాడంగి మండలం, గొల్లాది గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల, సినీ నటుడు, నంది అవార్డు గ్రహీత దాసరి తిరుపతిరావు హైదరాబాద్ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, టాలెంట్ అవార్డ్ అందుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. 44 ఏళ్లుగా నాటకరంగంలో అనుభవం ఉన్న తాను రెండు నంది అవార్డులతో పాటూ మూడు గోల్డ్‌మెడల్స్ సాధించానని, 18 సినిమాల్లో నటించినట్లు తెలిపారు. ఆర్.నారాయణ మూర్తి తీసిన యూనివర్సిటీలో మెయిన్ విలన్ పాత్రపోషించానని చెప్పారు. సుమన్‌తో విత్‌పవర్ సినిమాలో విలన్ కేరక్టర్ చేశానన్నారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో తనకు ఉత్తమ విలన్, కేరెక్టర్ ఆర్టిస్ట్‌గా అవార్డును దర్శక, నిర్మాత, యాంకర్, ఎడిటర్ గుర్రపు విజయుకమార్, నిర్మాత రామసత్యనారాయణ, ఎంపీ వేణుగోపాల్, దర్శక, నిర్మాత వంశీకృష్ణ తదితరులు అవార్డు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరావును పలువురు అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.



ఉత్తమ విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అవార్డు అందుకుంటున్న దాసరి తిరుపతిరావు

సాహితీ వేత్త పీవీబీ శ్రీరామమూర్తి అస్తమయం



పీవీబీ శ్రీరామ్మూర్తి మాస్టారు (ఫైల్)

పార్వతీపురంటౌన్: ప్రముఖ సాహితీ వేత్త, తెలుగు భాష ఉపాధ్యాయుడు పీవీబీ శ్రీరామ్మూర్తి మాస్టారు ఆదివారం సాయంత్రం తమ స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. పార్వతీపురం ఆర్‌సీఎం బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాష ఉపాధ్యాయుడిగా 30 దశాబ్దాలకు పనిచేసిన పీవీబీ శ్రీరామమూర్తి మాస్టారు ఇక లేరు. తెలుగు భాష ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తెలుగు భాషపై ఉన్న అభిమానంతో పార్వతీపురంలో 1980 ప్రాంతంలో పంతులు జోగారావు, పంతులు సీతాపతి, బెలగాం భీమేశ్వరరావు, శిష్టా హరిగోపాలరావు, మంచిపల్లి శ్రీరాములు సహాయ సహకారాలతో అభ్యుదయ సాహితీ అనే సంస్థను నెలకొల్పి సాహితీ సేవలను అందించారు. తరువాత అనతి కాలంలో అది పార్వతీపురం రచయితల సంఘంగా పేరు మార్చుకుంది. శ్రీరామ్మూర్తి మాస్టారు మరణంపై సాహితీ లహరి వ్యవస్థాపకుడు మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ పార్వతీపురం ఒక మంచి సీనియర్ కథా రచయితను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. పట్టణ ప్రముఖ రచయితలు గంట్యాడ గౌరినాయుడు, బాల సాహిత్య నిలయం వ్యవస్థాపకుడు ఎం.పార్థసారధి పలువురు సాహితీ వేత్తలు ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటుగా అభివర్ణించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పోక్సో కేసులో ముద్దాయికి శిక్ష ఖరారు

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌లో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు పూసపాటిరేగ మండలం పెదతాడివాడ గ్రామానికి చెందిన మైనపు హరీష్‌కు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 3వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. పూసపాటిరేగ మండలం పెదతాడివాడ గ్రామానికి చెందిన మైనపు హరీష్ అదే గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై 2024 నవంబరు 11న లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారన్నారు. నిందితుడు హరీష్‌పై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి పై విధంగా తీర్పు వెల్లడించినట్లు తెలిపారు.

150 కిలోల గంజాయి పట్టివేత

- కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద కారు వదిలి పరారైన డ్రైవర్

రామభద్రపురం: గంజాయి అక్రమరవాణా చేస్తున్న అక్రమార్కులపై రామభద్రపురం పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఒడిశా నుంచి అక్రమంగా రవాణాచేస్తున్న 150 కిలోల గంజాయిని కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు వద్ద పట్టుకున్నారు. సీఐ కె.నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావుతు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద వాహనాలు చెక్ చేస్తున్నారు. ఇంతలో ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తూ గంజాయితో ఉన్న డస్టర్ కారు డ్రైవర్ కారును జాతీయ రహదారి పక్కన చిన్న రూట్‌లో తప్పించుకుని స్పీడ్‌గా లాగించేశాడు. అప్రమత్తమైన ఏఎస్సై అప్పారావు, పోలీస్‌సిబ్బంది అప్రమత్తమై వెంటాడారు. సరిగ్గా కొట్టక్కి దుర్గమ్మ గుడి వద్దకు వెళ్లేసరికి సరిగా దారి కనిపించకపోవడంతో కారు వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. గంజాయితో ఉన్న కారును, అందులో ఉన్న 150 కిలోల గంజాయి(74 ప్యాకెట్లు)ని స్వాధీనం చేసుకున్నారు.కారులో ఉన్న పొల్యూషన్ సర్టిఫికెట్ పరిశీలించగా ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉందని, ప్రస్తుతం ఫేక్ నంబర్ ప్లేటు బోర్డు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎస్సై వి ప్రసాదరావు కేసు నమోదు చేయగా సీఐ కె.నారాయణరావు దర్యాప్తుచేస్తున్నారు.

రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

- కోర్టు భవనంపై నుంచి దూకిన ఖైదీ



విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్సపొందుతున్న త్రిమూర్తులు

విజయనగరం క్రైమ్: సబ్‌జైల్ నుంచి ఎస్కార్ట్ వాహనంలో విజయనగరం కోర్టుకు సోమవారం హాజరైన రిమాండ్ ఖైదీ.. అదే కోర్టు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఐ.త్రిమూర్తులు ఐదేళ్ల కిందట విజయనగరం అమ్మవారి జాతరలో పరిచయమైన ఓ యువతిని ప్రేమించాడు. ఆమె ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోకపోవడంతో ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. జిల్లా కోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీచేసింది. గత నెలలో అనకాపల్లిలో పట్టుకుని ఆయనను అరెస్టు చేసి సబ్‌జైల్‌లో ఉంచారు. ఎస్కార్ట్ సాయంతో కోర్టు వాయిదాకు తీసుకువచ్చారు. వాయిదాకు వస్తాడని తెలిసి అమ్మ నాగమణి, మూడో అక్క నాగేశ్వరి సైతం కోర్టుకు వచ్చారు. ఐదేళ్ల నుంచి వాయిదాలకు తిరుగుతున్నానని, బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుని చనిపోదామని నిర్ణయించుకుని మూడో ఫ్లోర్ నుంచి దూకేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కాళ్లు, చేతులు, తలకు చిన్నపాటి గాయాలయ్యాయని, ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని టూటౌన్ పోలీసులు తెలిపారు.

రామతీర్థంలో నేడు రథయాత్ర

- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం సిబ్బంది
- తిరువీధుల్లో ఊరేగనున్న సీతారామ చంద్ర మూర్తి



స్వామివారి ఉత్సవ విగ్రహాలు



రథయాత్రకు సిద్ధమైన స్వామివారి రథం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మంగళవారం రాత్రి రథయాత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి పందిరి రాట రోజునే సీతారామునిపేట గ్రామస్తులు రథాన్ని ఆలయం వద్దకు తీసుకువచ్చారు. స్వామి వారి రథాన్ని నూతన హంగులతో సుందరంగా తీర్చిదిద్ది రథయాత్రకు సిద్ధం చేశారు. ఏటా మాఘమాసంలో నిర్వహించే రథయాత్రకు విశేష ప్రాముఖ్యం ఉంది. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాత్రి 10గంటలకు రథంలో సీతాసమేత శ్రీరామచంద్ర ప్రభువును అధిష్ఠించి రామతీర్థం పురవీధుల్లో మంగళవాయిద్యాలు, అశేష భక్తజనం నడుమ ఊరేగించనున్నారు. మూడు గంటల పాటు జరిగే రథయాత్ర మహోత్సవం సజావుగా సాగేందుకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నారు.

తిరు వీధుల్లో ఊరేగనున్న స్వామివారు

ఉత్తర రాజగోపురం సమీపంలో కల్యాణ వేదికపై సీతారామస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకపూజలు జరిపించిన అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామివారి ఊరేగింపునకు ముందు పండిత పరిషత్ ఎంతో వైభవంగా జరిపిస్తారు. ఈ పరిషత్‌లో సీతారాముల గుణగణాలను తెలియపర్చడానికి వేదపండితులు పోటీపడతారు. అనంతరం రాత్రి 10గంటలకు రథం రామతీర్థం తిరువీధుల్లో ఊరేగింపునకు బయలుదేరుతుంది. ఉత్తర రాజగోపురం ఎదురుగా ప్రారంభమై ప్రధానరహదారి నుంచి కుమ్మరికానా వరకు వెళ్లి అక్కడినుంచి తిరువీధి మార్గం ద్వారా ఆలయం వరకు స్వామివారి యాత్ర కొనసాగుతుంది. సీతారామునిపేట, గొర్లిపేట, జగ్గరాజుపేట గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి రథాన్ని లాగడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. రథం ముందుకు సాగుతున్నప్పుడు భక్తులు రథం పైకి అరటి పళ్లు విసురుతూ మొక్కులు చెల్లించుకుంటారు.

క్రీడలకు ఎంతో ప్రాధాన్యం

- వెటర్నరీ కళాశాల వైస్ చాన్స్‌లర్ జేవీ రమణ
- ప్రారంభమైన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాసాంస్కృతిక పోటీలు



క్రీడా సాంస్కృతిక పోటీలను ప్రారంభిస్తున్న వైస్‌చాన్స్‌లర్, ముఖ్య అతిథులు తదితరులు



క్రీడా సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి):

క్రీడలకు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఎంతో ప్రాధాన్యం కల్పిస్తుందని, విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకునేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తిరుపతి వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.జేవీ రమణ అన్నారు. గరివిడి పశువైద్య కళాశాలలో 12వ రాష్ట్రస్థాయి అంతర వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా సాంస్కృతిక పోటీలు సోమవారం ఆరంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పశువైద్య కళాశాలలో క్రీడా ప్రాంగణంతో పాటు వివిధ రకాల క్రీడలకు అవసరమైన మౌలిక వసతులతో కూడిన సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు గెలుపోటములు చూడకుండా క్రీడల్లోను, చదువులోను ప్రతిభ కనబరచాలని సూచించారు. గరివిడిలోని పశువైద్య కళాశాల రాష్ట్రస్థాయి వెటర్నరీ, పాలిటెక్నిక్ అంతర కళాశాలల పోటీలకు వేదికగా నిలవడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా క్రీడా కార్యక్రమాలకు తమ వంతు సహాయసహకారాలు అందజేస్తున్న గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీనును అభినందించారు. ఏఎస్పీ డా.వి.సన్యాసిరావు మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ చదువుతో పాటుగా క్రీడల పట్ల కూడా తమ ప్రతిభను కనబరచాలని పిలుపునిచ్చారు. క్రీడలు మానసికంగా, శారీరకంగాను ఎంతో దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. గరివిడి ఫేకర్ సీఈఓ ఎంఎస్ఎస్.శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లోను, క్రీడల్లోను ఆసక్తి చూపాలని, విద్యార్థులు జంతువుల పట్ల ఆదరాభిమానాలు కలిగి ఉండాలన్నారు.

నాలుగు రోజుల పాటు క్రీడాపోటీలు

కళాశాల ప్రాంగణంలో ఈనెల 10 నుంచి 13 వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న క్రీడా సాంస్కృతిక పోటీల్లో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టేబుల్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్ క్రీడాపోటీలతో పాటు సాంస్కృతిక పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలు వెన్నెలవలస, గరివిడి, రామచంద్రాపురం, వీఆర్ గూడెం, రాపూరు, సదుం, పలమనేరు, కొమ్మెమరి, బనవాసి, మడకశిర కళాశాలల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు.

ముగ్గురికి గాయాలు

గుర్ల: మండలంలోని దేవునికణపాక వద్ద బాణసంచా తయారీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో బాణసంచా తయారీకి ఉపయోగించే ఒత్తులను కూలీలు ఆదివారం ఆరబెట్టారు. ఒత్తులు తడిగా ఉన్నాయని వాటికి అగ్ని అంటించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. గాయాలపాలైన వారిలో గవిడిపేటకు చెందిన సింగరాపు సబ్రహ్మణ్యం, తాడ్డి రమణ. గుషిడి సూర్యనారాయణ ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ముగిసిన ఖాదర్‌బాబా సుగంధ మహోత్సవాలు



ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: బాబామెట్టలో కొలువైన హజరత్ సయ్యద్ ఖాదర్ వలీ బాబా 66వ ఉరుసు మహోత్సవాలు సోమవారం దర్గాలో నిర్వహించిన సలామ్, ఖుల్‌షరీఫ్‌తో ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన సుగంధ మహోత్సవాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఖాదర్ బాబా దర్గాలో సుగంధ, చాదర్ సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. సూఫీ పరంపర మహనీయులను స్మరించుకుంటూ విశ్వశాంతి కోసం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దివ్య అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సూఫీ పీఠాధిపతులు ఖాజా మొహియుద్దీన్ షా ఖాదరీ, దర్బా దర్బార్ ధర్మకర్త ఖలీల్‌బాబు నేతృత్వంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రేమతత్వాన్ని ప్రబోధించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఎమ్మెల్యేలు కోళ్ల లలిత కుమారి, బేబీ నాయిన, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తదితరులు బాబాను దర్శించుకున్నారు.



బాబాకు చాదర్ తీసుకువస్తున్న భక్తులు, దర్బార్ సిబ్బంది